క్లుప్తంగా

రామనారాయణంలో ప్రత్యేక పూజలు



స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని రామ నారాయణం ప్రాంగణంలో ఉన్న భూదేవి, శ్రీదేవి సమేత వైకుంఠ నారాయణుడికి శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం పంచామృత స్నానం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు చాణక్య, శ్రీహర్షతేజ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓక్‌ల్యాండ్ స్కూల్‌కు గుర్తింపు



అవార్డు తీసుకుంటున్న ప్రిన్సిపాల్ రవి

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ఓక్‌ల్యాండ్ పాఠశాలకు 2024 – 25 సంవత్సరానికి గాను నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. హైదరాబాద్ ఇటీ టెక్ సంస్థ నిర్వహించిన వివిధ రకాల పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికి అవార్డు అందజేశారు.

గొర్రెల కాపరులను ఆదుకునేందుకు కృషి



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద్ద బూరాడపేటకు చెందిన గొర్రెల కాపరులను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు అన్నారు. గొర్రెల కాపరులను శుక్రవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం తిని ఒకేసారి 100 గొర్రెలు మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గౌరవం



పోస్ట్‌మన్ జగన్నాథరావును సన్మానిస్తున్న పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది

భోగాపురం: విధుల్లో అంకితభావంతో పనిచేసినప్పుడే గౌరవం లభిస్తుందని పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని తపాలాశాఖ కార్యాలయంలో పోస్ట్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన పోతల జగన్నాథరావును పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసరావుతో పాటు తపాలా శాఖ సిబ్బంది శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణంలోని వెంకటాచల దివ్యక్షేత్రంలో శుక్రవారం వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి రెండో శనివారం ఆలయంలో అన్న సమారాధన, ప్రతి శ్రవణా నక్షత్రం రోజున స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్‌బీఐ శిక్షణ కేంద్రం డైరెక్టర్ జీబీవీ రమణ అన్నారు. స్థానిక ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేసే వారిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ రక్తనిధి కేంద్రం కౌన్సిలర్ బి.అప్పలనాయుడు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

- చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న రహదారులు
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



గోతులతో నిండిపోయిన దుప్పాడ రోడ్డు



చెరువును తలపిస్తున్న దుప్పాడ గ్రామ రహదారి

రోడ్లు ఇలా.. నడిచేదెలా?

విజయనగరం రూరల్:

జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న పలు గ్రామాల రహదారులు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దుప్పాడ గ్రామ రహదారి చిన్నపాటి వర్షానికే చెరువుని తలపిస్తోంది. ఏమాత్రం వర్షం పడినా రోడ్డంతా నీరు నిండిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. వర్షాలు పడకపోయినా రోడ్డంతా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

గుంకలాంలో అధ్వానం..



గుంకలాం గ్రామంలో నందాం వెళ్లే రహదారి మొత్తం గుంతలమయమైంది. రోడ్డుపైకి నీరు చేరడంతో స్థానికులకు ఇబ్బందిగా మారింది. పలుమార్లు వాహనచోదకులు ఈ రోడ్డుపై ప్రమాదాల బారిన కూడా పడ్డారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు లెంక అక్కునాయుడు, బోగి శ్రీను, కర్రోతు రామకృష్ణ, తదితరులు తెలిపారు.

కొండకరకాంలో రహదారి దుస్థితి..



మండలంలోని కొండకరకాం గ్రామానికి వెళ్లే రహదారి మొత్తం గుంతలతో నిండిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అధ్వానంగా మారడంతో బయటివారు గ్రామానికి రావడానికే భయపడుతున్నారు. రోడ్ల పరిస్థితిపై ఎంపీడీఓ తిరుపతి వద్ద ప్రస్తావించగా.. మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తప్పవు

- రెవెన్యూ అధికారులు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ప్రత్యేక అధికారి అరుణకుమారి, తహసీల్దార్ గోవింద, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో దేవదాయశాఖ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి డి.అరుణకుమారి, తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. మండలంలోని గోవిందపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మ్యుటేషన్లు, డీ పట్టా మంజూరు, వివిధ భూ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. గోవిందపురం గ్రామంలో సర్వే నంబర్ 167లో 3.2 ఎకరాలకు సంబంధించిన దేవదాయ శాఖ భూమి అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదు అందింది. దీనికి మండల తహసీల్దార్ డి. అరుణకుమారి మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సుల్లో అందించిన సేవలకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. జిరాయితీ భూములు ఆక్రమణకు గురైనట్లయితే బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ గణపతిరావు, సర్వే డీటీ కల్యాణి, వీఆర్‌ఓ ఎస్.హరిబాబు, ప్రజాప్రతినిధులు బాలా అప్పలరాజు, దంగుడుబియ్యపు ఈశ్వరరావు, జనపాల అప్పారావు, విక్రం జగన్నాథం, బూర చిన్నారెడ్డి, నీలాపు బ్రహ్మానంద రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

సొంత భవనం నిర్మించాలి..

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలకు సొంత భవనాన్ని ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘ కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఒకప్పుడు విద్యల నగరంగా పేరొందిన విజయనగరంలో నేడు బీఈడీ, పీజీ, లా కళాశాలలు ఎత్తేశారన్నారు. ఉన్నత విద్యకు విశాఖపట్నం వెళ్లాల్సి వస్తోందన్నారు. శ్రీకాకుళం పట్టణంలో 10 మున్సిపల్ హైస్కూల్స్ ఉంటే.. విజయనగరంలో దశాబ్దాలుగా కేవలం మూడే మున్సిపల్ స్కూల్స్ ఉన్నాయని చెప్పారు. విజయనగరంలో ఉన్న ఏకైక మహిళా కళాశాలను కూడా మూసేశారని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9 న విద్యాశాఖ మంత్రికి ఈ మెయిల్ పంపే కార్యక్రమం.. 11 న సంతకాల సేకరణ.. 16న ఐక్య కార్యాచరణ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవికుమార్, ఆర్. శ్రీను, రామచంద్రరావు, సుదీర్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

పూసపాటిరేగ: మండలంలోని వెల్దూరు గ్రామంలో అనధికారంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన జీరు అప్పయ్యమ్మ నుంచి 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిని కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

నేడు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు

భోగాపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం మండలంలో ఉన్న 72 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు రమణమూర్తి, చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రొగ్రెస్, సహపంక్తి భోజనాలు, పలు పోటీలు పాఠశాల స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని, ఆయా పంచాయతీల కార్యదర్శులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు..

విజయనగరం టౌన్: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయని నారాయణ స్కూల్ వ్యవస్థాపకుడు మొయిద నారాయణరావు అన్నారు. తెలుగు భాషా సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గాజులరేగలో ఉన్న పాఠశాలలో చిన్నారులకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ప్రపంచ మేధావి..

భారత రాజ్యాంగ నిర్మాత ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బాబాసాహెబ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ అణగారిని పీడిత కులాల వారికి చేసిన మేలును వివరించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం: ఎస్టీ కమిషన్ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, తదితరులు



విజయనగరం ఫూల్‌బాగ్: 46వ డివిజన్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు



విజయనగరం టౌన్: బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం నివాళులర్పిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు



విజయనగరం అర్బన్: బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



విజయనగరం ఫోర్ట్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గో సంరక్షణ సమాఖ్య సభ్యులు

సోషల్ ఆడిట్‌కు సహకరించండి..

- ఎంపీపీ మామిడి



మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: గడిచిన 2023 – 24 ఏడాదిలో చేపట్టిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించనున్న అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకరించాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం నుంచి సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాల్లోకి వచ్చి చేపట్టిన పనులను పరిశీలిస్తారని చెప్పారు. పరిశీలన పూర్తయిన తర్వాత ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతిరావు, ఏపీఓ రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి..

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు



భోగాపురం: రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వస్తున్న సమస్యలను వింటున్న అధికారులు



విజయనగరం: రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్, తదితరులు

భోగాపురం: మండలంలోని వివిధ రెవెన్యూ గ్రామాలలో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని కవులవాడలో డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి వెంకటరామన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు బంగార్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. సురేష్, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ, కొండపు కొత్తయ్యరెడ్డి, కోరాడ తాతారావు, దాట్ల శ్రీనురాజు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పరిశీలన..

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని అయ్యన్నపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు తెలియజేసిన సమస్యలపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్ జాన్, తహసీల్దార్ కూర్మనాథ్, కార్పొరేషన్ ఏసీపీ హరిబాబు, రమణమూర్తి, సర్వేయర్ సింహాచలం, గ్రూప్ టెంపుల్స్ ఈఓ కె.పద్మావతి, సబ్ రిజిస్ట్రార్ టి.రమేష్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

డెంకాడ: రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని గుణుపూరుపేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, తహసీల్దార్ పద్మావతి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తుల నుంచి రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలను మండల ప్రత్యేకాధికారి కూర్మినాయుడు, తహసీల్దార్ సుదర్శనరావు స్వీకరించారు. దేవుని నెలివాడకు చెందిన పలువురు రైతులు దేవస్థాన భూములకు సంబంధించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరానికి విశేష స్పందన..

విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ వద్ద గల విజయ బ్లడ్‌బ్యాంక్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుతో పాటు డయాలసిస్, గర్భిణులకు రక్తం అవసరం ఉంటున్న నేపథ్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 46 మంది రక్తదానం చేశారని, ఆరోగ్యంగా ఉన్నవారు ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రఘు, వినయ్ వర్మ, రఘురామరాజు, రాము, విజయదుర్గ యూత్ సొసైటీ చైర్‌పర్సన్ కేశపట్నం చంద్రిక, విజయ బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం



బిల్లులు చెల్లించండి..

పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను తక్షణమే చెల్లించాలని పలువురు మధ్యాహ్న భోజన నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఆగస్టు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం కార్యకర్తల జీతాలతో పాటు భోజనం బిల్లులను కూడా వెంటనే చెల్లించాలని కోరారు. గౌరవ వేతనం రూ. 3 వేల నుంచి 15వేల రూపాయలకు పెంచాలని, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

– పూసపాటిరేగ

శతశాతం ఉత్తీర్ణతకు కృషిచేస్తాం



ఆర్ఐఓను మర్యాద పూర్వకంగా కలిసిన సభ్యులు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాలు శతశాతం వచ్చేలా బోధన సాగిస్తామని జిల్లా కాంట్రాక్టు లెక్చరర్ రెగ్యులైజేషన్ కార్యాచరణ కమిటీ ప్రకటించింది. కమిటీ గౌరవ అధ్యక్షురాలు లంక సంధ్య నేతృత్వంలో కమిటీ సభ్యులు శుక్రవారం ఇంటర్మీడియట్ పర్యవేక్షణ (ఆర్ఐఓ) అధికారి మజ్జి ఆదినారాయణ, జిల్లా వృత్తి విద్యాధికారి భీమశంకర్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు.

రక్షిత మంచినీటి పథకం పరిశీలన



ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం: రానున్న వేసవిలో ప్రజలకు నీటి సమస్య లేకుండా.. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు కమిషనర్ ఆదేశాలతో ఈఈ టి.రాయల్‌బాబు, ఇంజినీరింగ్ సిబ్బంది, తదితరులు ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఫిల్టరేషన్ విధానం, గ్యాలరీలు, సంప్‌లను పరిశీలించారు. అనంతరం నీరు పంపింగ్ అవుతున్న ప్రదేశానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. రక్షిత మంచినీటి పథకాల చుట్టూ ఇసుక బస్తాలు కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించే విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో డీఈ మణికుమార్ పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌ల పరిరక్షణ అందరి బాధ్యత

- కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపయుక్తంగా ఉండే వాకింగ్ ట్రాక్‌లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలో ఉన్న చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లను ఉద్యాన శాఖ అధికారి ఉమాభరణి నేతృత్వంలో ప్లాంటేషన్ సిబ్బంది, ప్రజారోగ్య సిబ్బంది శుక్రవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా వాకింగ్ చేయాలని సూచించారు. ఇందుకోసం ట్రాక్‌లు ఏర్పాటు చేశామని, అయితే వాటిని శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు.